క్లుప్తంగా

యోగ సిద్ధాంజనేయ స్వామికి సిందూర అర్చన


ముత్యాలకవచంతో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్ – 2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామికి కార్తీక మాసం మూడో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో యోగ సిద్ధాంజనేయుడి ఉత్సవ మూర్తికి పాంచరాత్ర ఆగమ సాంప్రదాయంలో సిందూర అర్చన, పూజలు చేశారు. అనంతరం ముత్యాల కవచంతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహికంగా సుందరాకాండ పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు, కమిటీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సూర్యానగర్, సత్యానగర్, పట్టాభిరెడ్డితోట, అయ్యప్పనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు


మ్యూజికల్ చైర్ ఆడుతున్న బాలికలు

మురళీనగర్: మురళీనగర్‌లోని మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భారత మొట్టమొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఓమ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీళ ముఖ్య అతిథిగా పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల బాలికలకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు శశికళ మాట్లాడుతూ ఇందిరాగాంధీ భారత దేశానికి చేసిన సేవలను వివరించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వి.ప్రమీల, శశికళను సత్కరించారు. స్థానిక పాఠకులు లక్ష్మి, కోటి, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు


విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట : ఇటీవల గుడివాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాల విద్యార్థిని పి.తేజశ్రీ 45 కిలోల విభాగంలో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్పమాలకు రామ్‌చరణ్ అపచారం

జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు అభ్యంతరం

సీతమ్మధార: హీరో రామ్ చరణ్ అయ్యప్ప మాలలో ఉండి కడప పెద్ద దర్గాను దర్శించుకోవడాన్ని హిందూ జాతీయవాద నాయకుడు జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. అయ్యప్ప మాలలో ఉంటూ దర్గాను దర్శించుకోకూడదని తెలిసినా.. వచ్చినట్లు రామ్‌చరణ్ గర్వంగా చెప్పుకోవడం ఏంటని మండిపడ్డారు. హీరో అనే అహంకారంతో అయ్యప్పమాలను అపచారం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన రామ్‌చరణ్ హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పేంతవరకు ఆందోళనలు చేపడతామన్నారు.

సమస్యల వలయం

- మౌలిక వసతులు లేక గాంధీనగర్ వాసుల అవస్థలు
- శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యంతో అధ్వానంగా పారిశుధ్యం


దట్టమైన పొదలతో నిండిన గాంధీనగర్ కాలనీ


ఈ రోడ్డే కాలనీవాసులకు దిక్కు


ప్రధాన రహదారిలో డ్రైనేజీపై ఏర్పాటు చేసిన వంతెన దాటుతున్న పిల్లలు


గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలు

కంచరపాలెం : విశాఖ నగరం స్మార్ట్ సిటీగా మారుతున్నా కొన్ని మురికివాడల పరిస్థితి మాత్రం నేటికీ మారడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి దూరంగా అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో స్థానికులు మలమూత్ర విసర్జనకు ఆరుబయటకు, కొద్ది దూరంలోని సులభ్ సౌచాలయానికి వెళ్తున్నారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదీ జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి నేతాజీ వంతెనకు ఆనుకుని ఉన్న గాంధీనగర్ మురికివాడ దుస్థితి. ప్రభుత్వాలు మారినా దశాబ్దాలుగా ఇక్కడి ప్రజల జీవన స్థితిగతులు మాత్రం మారడం లేదు.

నేటికీ కుళాయిలు లేక ఇబ్బందులు

గాంధీనగర్ కాలనీ నివాసితులను తాగునీరు సమస్య వేధిస్తోంది. వందలాది కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నా వారి అవసరాలకు తగ్గ కుళాయిలు, చేతి బోర్లు లేవు. 15 ఏళ్ల క్రితం కాలనీలో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ జీవీఎంసీ నిధులతో రెండు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం నేతృత్వంలో ట్యాంకర్ల ద్వారా ఇక్కడకు నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు 2014 – 19లో కూడా ఇక్కడి ప్రజలకు స్థానిక శాసనసభ్యునిగా కనీస అభివృద్ధి చేయలేదు. 2019 – 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికైన గంటా శ్రీనివాసరావు మొత్తం నియోజకవర్గాన్నే పట్టించుకోలేదని... మా ప్రాంతంలో అభివృద్ధి పూర్తిగా శూన్యమని కాలనీ వాసులు వాపోతున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

కాలనీలో పారిశుధ్యం మరీ అధ్వానంగా మారిందని, శానిటరీ సిబ్బంది జాడ కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దుర్వాసన భరించలేక పోతున్నామని, దోమలు, ఈగలు స్వైర విహారం చేయడంతో రోగాలు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. చెత్త, వ్యర్థాలు తొలగించేందుకు ఎవరూ రావడం లేదని ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ప్రాంతంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా డ్రైనేజీలు, రోడ్లు

కాలనీలో సుమారు 110 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడ రోడ్లు, కాలువలు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ రోడ్డు చూసినా మట్టి, రాళ్ల రహదారులుగా కనిపిస్తున్నాయి. సీసీ రోడ్లు జాడ కనిపించడం లేదు. ఇప్పటికి గోతులు, గుంతలతో కూడిన మట్టి రహదారులే దర్శనమిస్తున్నాయి. భారీగా కురిసిన వర్షాలకు మట్టి రహదారులు బురదమయమై దర్శనమిస్తున్నాయి. కాలనీలో డ్రైనేజీలు లేకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. భారీ వర్షాలు కురిసేటప్పుడు కాలనీ ముంపునకు గురవుతోంది. మట్టి డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తూ కాలనీని ముంచెత్తుతున్నాయి. అలాంటప్పుడు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.


కాలనీలో అధ్వానంగా తయారైన డ్రైనేజీ

మరోవైపు ఇక్కడి వీధుల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేయకపోవడంతో రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి ఎమ్మెల్యే గంటాకు, జీవీఎంసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో... వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు వార్డులో పర్యటించి సోలార్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. అవే ఇప్పటికీ స్థానికులకు వెలుగులు పంచుతున్నాయి.

సొంతింటి కోసం ఎదురు చూస్తున్నాం



ఏళ్ల తరబడి ఇక్కడ నివసిస్తున్నా కనీస వసతులు లేకపోవడంతో జీవనం సాగించలేక పోతున్నాం. జగనన్న ప్రవేశపెట్టిన పథకంతో మా సొంతింటి కళ నెరవేరే సమయంలో ప్రభుత్వం మారిపోయింది. మా నివాసాల వద్దే ఇళ్లు నిర్మిస్తే మా కళ నేరవేరుతుంది. కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– కల్లిపిల్లి లీలావతి, స్థానికురాలు

సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం



కాలనీలో సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించాలి. ఇక్కడ మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల సమయంలో కనిపించిన స్థానిక ప్రజాప్రతినిధులు జాడ ఇప్పుడు కనిపించడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– టొక్కం జయమ్మ, స్థానికురాలు

జోరుగా గార్డెన్ అభివృద్ధి పనులు


గార్డెన్ అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు

సీతంపేట : జీవీఎంసీ 44వ వార్డు పరిధి అక్కయ్యపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో జరుగుతున్న ఫ్లవర్ గార్డెన్ అభివృద్ధి పనులను ఆ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు, బ్యూటిఫికేషన్‌కు అత్యంత ప్రాధాన్యమిచ్చిందని గుర్తు చేశారు. 44వ వార్డు పరిధిలో అక్కయ్యపాలెం హైవే కూడలి నుంచి పోర్టు ఆస్పత్రి జంక్షన్ వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని పార్కులు, ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఇందులో భాగంగా ఫ్లవర్ గార్డెన్ పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయని... బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. బుద్ధుని విగ్రహం వద్ద యోగా చేసుకోవడానికి వీలుగా లైటింగ్, ఫౌంటెయిన్స్, వాటర్ స్ప్రింక్లర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నగరంలో గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని ఒక మోడల్‌గా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. వచ్చే నెల పదో తేదీకల్లా ఫ్లవర్ గార్డెన్ పనులు పూర్తయ్యేలా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ వర్క్స్ ఏఈ రమణమ్మ, హార్టికల్చర్ ఏఈ అర్చన, వాటర్ వర్క్స్ ఏఈ రహీమ్ పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి


ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

సీతంపేట : ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం అక్కయ్యపాలెం జోన్ నాయకుడు వై.రాజు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఆస్పత్రిలో పనిచేస్తున్న 38 మంది కార్మికులను అక్రమంగా తొలగించడానికి యాజమాన్యం పూనుకోవడం అన్యాయమన్నారు. కార్మికులను తొలగిస్తున్నట్టు నోటీసులు జారీ చేశారని, ఇది కార్మిక చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం బాధితులతో కలిసి అక్కయ్యపాలెంలోని లేబర్ ఆఫీసు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని, యాజమాన్యం కోరినట్టు కాగితాలు రాసి ఇవ్వలేదని జీతాలు ఆపేశారన్నారు. 38 మందికి ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జరిగిన అన్యాయంపై జాయింట్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్మిక శాఖ అధికారులు చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

టోల్‌గేట్ తొలగించాలని వినతి


సింహాచలం ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవస్వామి దేవస్థానం ఆవరణలో గల టోల్ గేటుని వెంటనే తొలగించాలని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ కోరారు. ఈ మేరకు ఆయన సింహాచలం దేవస్థానంలో కార్యనిర్వహణాధికారిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ టోల్‌గేట్ కారణంగా భక్తులు, ముఖ్యంగా అయ్యప్ప మాలధారులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్తీకమాసంలో అయ్యప్పభక్తులు అధిక సంఖ్యలో రోజుకి రెండు లేదా మూడు సార్లు మాధవస్వామి దేవస్థానానికి వస్తారని గుర్తు చేశారు. వీరికి టోల్‌గేటు రుసుం భారంగా పరిణమించిందని తెలిపారు. ఇక్కడ తరచూ భక్తులు, టోల్‌గేటు నిర్వాహకులకు గొడవలు జరుగుతున్నాయని ఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన ఈవో మాట్లాడుతూ తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. టోల్‌గేట్ కాంట్రాక్టర్‌ని పిలిచి మాట్లాడుతామన్నారు. స్థానిక స్వాములు, భవానీ మాలధారులు, ప్రజలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ఇందుకు ఈవోకి కార్పొరేటర్ ధన్యవాదాలు తెలిపారు.

తూతూమంత్రంగా మరమ్మతులు


ఏఎస్‌ఆర్ నగర్‌లో తూతూ మంత్రంగా చేసిన మరమ్మతులు

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కొద్ది రోజులుగా చేపట్టిన మరమ్మతుల్లో నాణ్యత పాటించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు కొంతకాలంగా జోన్ – 3 ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్యాచ్ వర్కులు నిర్వహిస్తున్నారు. సీతమ్మధార, బాలయ్య శాస్త్రి లే అవుట్, ఏఎస్‌ఆర్ నగర్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో రోడ్ల మీద గోతులకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. కానీ, ఎక్కడా స్టాపర్‌బోర్డులు ఏర్పాటు చేయకుండానే పనిచేస్తుండడం గమనార్హం. ఫలితంగా ఇలా ప్యాచ్‌వర్కు పూర్తికాగానే అలా దానిపై నుంచే వాహన చోదకులు వెళ్లిపోతున్నారు. ముందే నాణ్యత లేకపోవడంతోపాటు వెంటనే వాహనాలు వెళ్లిపోవడంతో మళ్లీ గతుకులు ఏర్పడుతున్నాయి. పనుల వద్ద జోన్ – 3 ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. గోతులను సక్రమంగా పూడ్చకుండానే పైపైన తారు వేసి ప్యాచ్‌వర్కులు నిర్వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్యాచ్‌వర్కులను పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు


జీవీఎంసీ 14వ వార్డు క్షత్రియ కల్యాణ మండపం దరి రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి


బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో రోడ్డుపైనే కాంక్రీట్ పనులు నిర్వహిస్తున్న ఇంటి యజమాని

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు క్షత్రియ కల్యాణ మండపం దరి రోడ్డులో, బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో భవన నిర్మాణ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై అడ్డంగా ఇసుక, పిక్క, ఇతర సామగ్రి వేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిలో ఇష్టారాజ్యంగా ఇంటి యజమానులు సామగ్రి వేయడం సరికాదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ ప్రాంతంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉన్నా పోలీసులు, జీవీఎంసీ జోన్ – 3, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తెలుగు సాహిత్య చరిత్రలో ఎందరో మహనీయులు


ప్రసంగిస్తున్న అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు

సీతంపేట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 'శతజయంతి సాహితీమూర్తులు' ప్రసంగలహరి నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ ఒక ఏడాది అటుఇటుగా వందేళ్ల క్రితం జన్మించిన మహనీయులు కాళీపట్నం రామారావు గొప్ప కథకులుగా, అవంత్స సోమసుందర్, దాశరథి గొప్ప కవులుగా, తెలంగాణ పోరాట యోధులుగా, ఆరుద్ర గొప్ప రచయితగా, ఆలూరి బైరాగి విలక్షణమైన కవిత్వం రాశారని గుర్తు చేశారు. ఒక్కొక్కరూ మహావృక్షాలై వందేళ్ల తర్వాత కూడా మనం మాట్లాడుకునేంత గొప్పగా తెలుగు సాహిత్య చరిత్రలో నిలిచిపోరాయని కొనియాడారు. అరసం కార్యదర్శి క్షేత్రపాల్‌రెడ్డి మాట్లాడుతూ కారా కథల్లో వాస్తవిక సన్నివేశాలను వివరించారు. ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ వజ్రాయుధ కవి అవంత్స సోమసుందర్ కవితా దృక్పథాన్ని వివరించారు. దాశరథి చలన చిత్ర గీతాలను రాంభట్ల నృశింహశర్మ ఆలపించి, అందులోని సాహిత్య విలువలను విశ్లేషించారు. ఆరుద్రత్వమేవాహం కావ్యం గురించి డాక్టర్ ఎం.సుబ్బారావు, ఆలూరి బైరాగి సాహిత్య సమాలోచన గురించి ఆచార్య వెలమల సిమ్మన్న ప్రసంగించారు. కార్యక్రమంలో అరసం ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతరావు, పి.ఎ.రాజు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


కోటేశ్వరరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ ఎంట్రప్రెన్యూర్ డేని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోర డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో సాగర్ కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్రోన్స్ రంగంలో ఎంట్రప్రెన్యూర్‌గా ఎదగడం, విజయం సాధించడం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్ష కలిగిన వారికి స్ఫూర్తిని అందించే విధంగా ఈ ప్రసంగం సాగింది. డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి వాల్యూమెట్రిక్ ఎనాలసిస్ చేసే విధానాన్ని ఆయన తెలియజేశారు. ప్రణాళిక, డేటా సంపాదించడం, డేటా ప్రాసెస్ చేయడం, ప్రాజెక్ట్స్ పూర్తి చేయడం అనే దశలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా తాను నిర్వహించిన పలు ప్రాజెక్టులను విద్యార్థులతో పంచుకున్నారు. అదే విధంగా ఆ హబ్ అందిస్తున్న ప్రోత్సాహం, ఇటీవల సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.పద్మశ్రీ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య బి.ప్రజ్ఞ, ఈసీఈ విభాగాధిపతి ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగర్ కోటేశ్వరరావును కళాశాల తరపున సత్కరించారు. డ్రోన్ వ్యవస్థకు సాగర్ అందిస్తున్న సేవలు, కృషిని ప్రిన్సిపాల్ అభినందించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాక్ష పూజ

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో కొలువైన ఉమారామలింగేశ్వరునికి కార్తీక మాసం మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం అనంతరం శివుని జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా 9 గంటలకు రుద్రాక్షలతో పూజ, గణపతి, సుబ్రహ్మణ్య సహిత రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం ఆకాశ దీపారాధన నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, సనపల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సత్యానగర్‌లోని సోమలింగేశ్వరాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో కొమ్మూరు ఉమాప్రసాద్ భాగవతార్ మంగళవారం సాయంత్రం సుందరాకాండ కథాగానం చేశారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 17 కేజీల గంజాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ పి.శివనారాయణ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, మధుర జిల్లాకు చెందిన దేవేంద్ర 17 కేజీల గంజాయి విశాఖపట్నం మీదుగా ఆగ్రా తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. గంజాయి స్వాధీనం చేసుకుని, విచారణ నిమిత్తం జీఆర్పీ సిబ్బందికి నిందితుడిని అప్పగించారు. అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

మరో ప్రాంతంలో పది కేజీలు...

అదేవిధంగా రైల్వే స్టేషన్‌లోని మరో ప్రాంతంలో జీఆర్పీ ఎస్‌ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ ఎం.ఎల్.మీనా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలలో ఆర్పీఎఫ్ సిబ్బంది ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీపాన్షు పరిహార్, గౌతం సింగ్ పరిహార్ నుంచి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు విశాఖపట్నం మీదుగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు నిర్ధారించి అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం జీఆర్పీ సిబ్బందికి నిందితులను అప్పగించారు. అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ కె.శాంతారాం తెలిపారు.

ఎన్‌ఎంసీహెచ్‌లో ఆధార్ శిబిరం


విద్యార్థుల ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార : విద్యార్థుల ఆధార్ నమోదు సమయంలో దొర్లిన చిన్నచిన్న తప్పులను సీతమ్మధార దరి పీఅండ్‌టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎన్‌ఎంసీహెచ్)లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో సవరిస్తున్నారు. ఆధార్ కార్డులో తప్పులు, అక్షర దోషాల సవరణకు తగిన ఆధారాలు అందజేస్తే సవరిస్తామని నిర్వాహకులు తెలిపారు. సచివాలయంలో జారీ చేసిన పుట్టిన తేదీ, ఇతర ధృవపత్రాల ఆధారంగా తప్పులు సరిదిద్దుతున్నారు. ఈ ప్రత్యేక శిబిరం బుధవారం కూడా కొనసాగుతుందని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు మాత్రమే ఆధార్‌కార్డులో సవరణలకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీతమ్మధార ఎంఈవో డి.రామారావు శిబిరాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ జోన్ – 3 సచివాలయం సిబ్బంది బి.రామ్‌ప్రసాద్, జి.యమున, తదితరులు పాల్గొన్నారు.

వాష్ కార్యక్రమంపై డీఆర్‌డీఏలో సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

ఎంవీపీకాలనీ: జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి.లక్ష్మీపతి ఆధ్వర్యంలో వాష్ (వాటర్, శానిటేషన్, హైజీన్) కార్యక్రమంపై జిల్లా ఏపీఎంలకు, డీపీఎంలు, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో యూనిసెఫ్, సెర్ప్ అధికారుల సమన్వయంతో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం, రక్షిత మంచినీరు సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, వ్యక్తిగత అలవాట్లలో మార్పులు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించడంతోపాటు శిక్షణ అందించారు. మండల స్థాయిలో అవగాహన కల్పించాలని పీడీ లక్ష్మీపతి ఈ సందర్భంగా తెలిపారు.